## చెత్తను ఇంటి వద్దే రీసైక్లింగ్ చేసుకోవాలి: కలెక్టర్

కార్పొరేషన్, మార్చి 21: కరీంనగర్‌లోని ప్రజలు, అపార్ట్‌మెంట్ వాసులు ఇంటి వద్దే చెత్తను రీసైక్లింగ్ చేసి రీ యూజ్ చేసుకోవాలని కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కళాభారతిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ ఎక్స్‌పోను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి వెలువడే ఆహార వ్యర్థాలు, తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చే యంత్రాలు, పరికరాలను వినియోగించుకోవాలన్నారు. వచ్చిన ఎరువును మొక్కల సంరక్షణకు వినియోగించుకోవచ్చని, తద్వారా ప్రకృతిని సంరక్షించిన వారమవుతామని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో చెత్తను ఎరువుగా మారుస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కొత్తపల్లి, మార్చి 21 : కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు క్రీడల్లో విశేషంగా రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాల, అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్, యోగా కేంద్రం, జిమ్నాస్టిక్స్, యోగా, అథ్లెటిక్స్, జూడో క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలు, వసతులను కల్పించగా, వాటిని శుక్రవారం పరిశీలించారు. స్పోర్ట్స్ స్కూల్ వద్ద విద్యార్థుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు అవకాశం

కలెక్టరేట్, మార్చి 21 : పద్దెనిమిదేళ్లు నిండిన వారంతా కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ తెలిపారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమంపై సెగ్మెంట్‌లోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్త ఓటరు కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన వెంటనే విధిగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో కె.మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, పలు పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, సిరాజ్‌హుస్సేన్, నాంపల్లి శ్రీనివాస్, మిల్కూరి వాసుదేవ రెడ్డి, కళ్యాడపు ఆగయ్య, సిరిసిల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన 'పది' పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మార్చి 21 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి రోజు జరిగిన ప్రథమ భాష పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,188 మందికి గానూ 12,173 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్ వీఎస్ జనార్ధన రావు పేర్కొన్నారు. అలాగే, ప్రైవేటు విద్యార్థులు 15 మందికి గానూ 9 మంది పరీక్ష రాశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు 21 పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ తొమ్మిది పరీక్షా కేంద్రాలు, జిల్లా విద్యా శాఖాధికారి నాలుగు పరీక్ష కేంద్రాలు, రాష్ట్ర పరిశీలకులు ఒక పరీక్ష కేంద్రాన్ని, అదనపు కలెక్టర్ మూడు కేంద్రాలు, మొత్తం 38 కేంద్రాలను తనిఖీ చేసినట్లు వివరించారు.

## సికాస వ్యవస్థాపక మాజీ సభ్యుడు హుస్సేన్ విడుదల


హుస్సేన్

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)వ్యవస్థాపక మాజీ సభ్యుడు, మావోయిస్టు, రచయిత మహ్మద్ హుస్సేన్ అలియాస్ రమాకాంత్ శుక్రవారం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. 70ఏండ్లకు పైబడిన ఆయనను గతేడాది జూలై 8న మంచిర్యాల జిల్లా పోలీసులు ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి హుస్సేన్ ఖమ్మం, హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిసింది.

## అందాల పోటీలు కాదు.. ఆత్మహత్యలు ఆపాలి

కలెక్టరేట్, మార్చి 21 : యాసంగిలో సాగు నీరందక రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే వాటిని నిలువరించలేని ప్రభుత్వం, రాష్ట్రంలో అందాల పోటీలు ఎలా నిర్వహిస్తుందని తెలంగాణ ఫార్మర్స్ ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.నారాయణరెడ్డి ప్రశ్నించారు. యాసంగికి అవసరమైన సాగునీరు చివరి ఆయకట్టు దాకా అందించాలంటూ శుక్రవారం ఫార్మర్స్ ఫోరం ప్రతినిధులతో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముందుచూపుతో వ్యవహరించకుండా నిర్లక్ష్యం వహించడంతోనే వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉన్న నీటిని సద్వినియోగం చేసే దిశగా కార్యాచరణ రూపొందించి, రైతుల పంటలు కాపాడాలని అదనపు కలెక్టర్‌కు అందజేసిన వినతి పత్రంలో కోరారు.

## సత్వర విద్యుత్ సరఫరాకు 'హైపర్'

ముకరంపుర, మార్చి 21: ప్రకృతి వైపరీత్యాల సమయంలో వినియోగదారులకు వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు హైపర్ కార్యాచరణ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు తెలిపారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు.

## 'గాయత్రీ' విద్యార్థులకు అత్యుత్తమ జీపీఏలు

జమ్మికుంట, మార్చి21: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన 1,2,3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు డివిజన్ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. డివిజన్‌లో అత్యుత్తమ జీపీఏలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ముష్కు వీరరాజు, ప్రిన్సిపాల్ కుమారస్వామి అభినందించారు. ఇక్కడ అధ్యాపకులు అంజిబాబు, రమేశ్, చంద్రయ్య, కరుణసాగర్, మధూకర్, విద్యార్థులున్నారు.

## నాయకుల ముందస్తు అరెస్ట్

సైదాపూర్, మార్చి 21: అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముదిరాజ్ మహాసభ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోలు ప్రవీణ్‌కుమార్, యువత మండలాధ్యక్షుడు నీర్ల సతీశ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, సాయంత్రం వదిలిపెట్టారు.

# రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల్లో వేగం పెంచాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్


కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనుల వివరాలు తెలుసుకుంటున్న జీఎం

ముకరంపుర, మార్చి 21: అమృత్ భారత్ పథకంలో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న ఆధునీకరణ పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రైలు మార్గం ద్వారా ప్రత్యేక రైలులో నిజామాబాద్ నుంచి కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ మేనేజర్‌తో పాటు ప్రాజెక్టు, ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు జీఎంకు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్‌లో రూ.44కోట్లతో చేపడుతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. స్టేషన్ ఆవరణలోని అన్ని ప్రాంతాలను జీఎం కలియ తిరిగి, పనుల ప్రగతి, జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పని, ఇంకా మిగిలి ఉన్న పనుల గురించి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (సీపీఎం) సుబ్రమణ్యం జీఎంకు వివరించారు. ప్రస్తుతానికి 90శాతం పని పూర్తయిందని, మిగులు పనులను వెంటనే పూర్తి చేసి, ఏప్రిల్ 25 లేదా 27లోగా రైల్వే స్టేషన్ ప్రారంభానికి సిద్ధం చేసే కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

**విజ్ఞప్తుల వెల్లువ:** రైల్వే పనుల పరిశీలనకు వచ్చిన జీఎంను రైల్వే హమాలీ యూనియన్ నాయకులు, హమాలీలు సన్మానించారు. రైల్వే గూడ్స్ షెడ్డును కరీంనగర్‌లోనే కొనసాగించాలని, ఒకవేళ కొత్తపల్లి రైల్వే స్టేషన్‌కు తరలిస్తే ప్రస్తుతం ఉన్న కరీంనగర్ స్టేషన్‌లో పనిచేస్తున్న హమాలీలకే పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, కరోనా సమయంలో రద్దు చేసిన కాజీపేట-బల్లార్షా రైలు 17035(అజ్ని), కరీంనగర్- తిరుపతి రైలు 12762ను పొత్కపల్లిలో నిలుపాలని పొత్కపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, పెద్దపల్లి సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి రజినీకాంత్ గౌడ్ జీఎంకు విజ్ఞప్తి చేశారు. తీగలగుట్టపల్లె రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న ఇళ్లల్లోని డ్రైనేజీ, వర్షం నీటి ప్రవాహాన్ని రైల్వే డ్రైనేజీలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసి బొల్లాడి మల్లారెడ్డి జీఎంకు విన్నవించారు.

## తక్కువ ఖర్చులో అసమాన వైద్యం


రెనే హాస్పిటల్‌లో డర్మటాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బంగారి రజినీ ప్రియదర్శిని

విద్యానగర్, మార్చి 21 : కాస్మోటిక్, చర్మ సమస్యలకు సంబంధించి అందరికీ అందుబాటులోకి తక్కువ ఖర్చులో రెనే హాస్పిటల్‌లో అసమాన వైద్యం అందించనున్నట్లు సీనియర్ ఇన్ఫర్టిలిటీ వైద్యురాలు, రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.బంగారి రజినీ ప్రియదర్శిని తెలిపారు. రెనే హాస్పిటల్లో చర్మ, కాస్మోటిక్ వైద్య సేవల విభాగాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెనే హాస్పిటల్‌లో హైదరాబాద్‌కు చెందిన కాస్మో డర్మటాలజిస్ట్ డా.రీతూ రావు వైద్య సేవలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి వైద్యం చేయించుకునే సమయం, స్థోమత లేని వారి కోసం ప్రతి నెల నాలుగో శుక్రవారం స్థానిక రెనే హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటానని కాస్మో డర్మటాలజిస్ట్ డా.రీతూ రావు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఫాగ్సీ అధ్యక్షురాలు, సీనియర్ స్త్రీల వైద్య నిపుణురాలు డా.స్వీతీ అనూప్ రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ జనరల్ సర్జన్ డా.అనూప్ రావు, తెలంగాణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డా. బి. ఎన్.రావు, రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్రాచారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, సీనియర్ ఫిజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, డీన్ డా. మునీష్, డా.కృష్ణారెడ్డి, డా. లతీశ్ రెడ్డి, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్ పాల్గొన్నారు.

## చెల్పూర్‌లో వారసంత పునర్ ప్రారంభం

హుజూరాబాద్ రూరల్, మార్చి 21: చెల్పూర్ గ్రామంలో ఆదివారం నుంచి వారసంత పునర్ ప్రారంభిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జయేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, చిరువ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని ఆందోళన

కార్పొరేషన్, మార్చి 21: కరీంనగర్‌లోని శివనగర్‌లో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సెల్ టవర్ ద్వారా రేడియేషన్‌తో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందంటూ స్థానిక మహిళలు ధర్నా చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు నాగమణి, రాణి, సరిత తదితరులు పాల్గొన్నారు

## అన్నదాతకు అండగా రామడుగు సింగిల్‌విండో


సర్వసభ్యమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, మార్చి 21: దశాబ్దాల కాలంగా రామడుగు సింగిల్‌విండో అన్నదాతలకు అండగా నిలుస్తూ, వారి ప్రగతికి బాటలు వేయడంలో ముందు వరుసలో నిలుస్తున్నదని సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్‌లో చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం 64వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమష్టి సహకారంతో సంఘం మరింత బలోపేతమై సేవలు అందిస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో గుండి, దేశరాజ్‌పల్లి, వెలిచాల గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. కొత్తరకం వంగడాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కటింగ్స్‌పై మాట్లాడుతూ, గతంలో కూడా జరిగాయని, ప్రస్తుతం కూడా జరుగుతున్నాయన్నారు. కటింగ్ అనేది మిల్లర్లపై ఆధారపడి ఉంటుందని, గత సీజన్‌లో తమ ధాన్యానికి సంబంధించి కూడా కోత పెట్టారని తెలిపారు. అంతకు ముందు సంఘం కార్యదర్శి మల్లేశం సంఘం పురోభివృద్ధి వార్షిక నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి శివనాగేందర్ రెడ్డి, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు, సంఘ కార్యదర్శి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సుజాతకు మహిళా శక్తి పురస్కారం

కమాన్‌చౌరస్తా, మార్చి 21: ప్రముఖ కవయిత్రి రచయిత్రి, సామాజిక సేవకురాలు డాక్టర్ అడువాల సుజాత రాష్ట్రస్థాయి మహిళా శక్తి పురస్కారానికి ఎంపికయ్యారని తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ రావూరి వనజ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భారత్ స్కౌట్, గైడ్స్ మహబూబ్‌నగర్ జిల్లా అసోసియేషన్ భవన్‌లో ఈ నెల 23న పురస్కార ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

## ముందుకు నడిపించేదే కవిత్వం

కమాన్‌చౌరస్తా, మార్చి 21: మానవాళిని ముందుకు నడిపించే శక్తి ముమ్మాటికి కవిత్వానికే ఉన్నదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ పేర్కొన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా నగరంలోని జ్యోతిబాపూలే మైదానంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక్కడ తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్, తదితరులున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

రామడుగు/ చొప్పదండి/గంగాధర, మార్చి 21: రామడుగు ఎస్ఐగా రాజు, చొప్పదండి ఎస్ఐగా సురేందర్, గంగాధర ఎస్ఐగా వంశీకృష్ణ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించారు. రామడుగు ఎస్ఐగా ఇదివరకు విధులు నిర్వర్తించిన శేఖర్ వీఆర్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో రాజు బాధ్యతలు చేపట్టారు. అలాగే చొప్పదండి ఎస్ఐగా ఇదివరకు విధులు నిర్వర్తించిన అనూష బదిలీపై వెళ్లగా, కరీంనగర్లో ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న మామిడాల సురేందర్ బాధ్యతలు స్వీకరించారు. గంగాధర ఎస్ఐగా పని చేస్తున్న నరేందర్‌రెడ్డి కరీంనగర్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ కాగా, కరీంనగర్ సీసీఎస్‌లో పని చేస్తున్న వంశీకృష్ణ బదిలీపై వచ్చారు.

## సీడ్ బాల్స్ తయారీపై శిక్షణ

కమాన్‌చౌరస్తా, మార్చి 21: సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా శుక్రవారం సీడ్‌బాల్స్ తయారీ, వర్మి కంపోస్ట్ తయారీపై రిసోర్స్ పర్సన్స్ మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య శిక్షణ ఇచ్చారు. విత్తన బంతులు తయారు చేయించారు. ఇక్కడ హెచ్ఎం రాజేందర్, సంధానకర్త గాజుల రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మూఢనమ్మకాలు వీడాలి

జమ్మికుంట, మార్చి 21: విలాసాగర్ గ్రామంలో మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అధికారులు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, ఎంపీడీవో భీమేశ్, సీఐ రవి మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను వీడాలని, అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మూఢ నమ్మకాలతో ఊరు విడిచి వెళ్లడమనేది సరికాదన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★శ్రీ ఆగస్త్య విద్యాసంస్థలో పనిచేయుటకు టీచర్స్ కావలెను. అడ్రస్: చైతన్య యువజన సంఘం, భగత్‌నగర్, KNR. ఇంటర్వ్యూ తేది: 23-3-25 న, Cell: 89777 35985/89777 35989.
NTK-0000

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

చొప్పదండి, మార్చి 21: మండలంలో శుక్రవారం అకాల వర్షం కురవడంతో చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వడగండ్ల వానతో పలు గ్రామాల్లో మామిడి తోటలు, మక్క పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో ప్రధాన రహదారులన్నీ జలమయంగా కావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

## ప్రజల సహకారంతోనే స్వచ్ఛ హుజూరాబాద్

హుజూరాబాద్ టౌన్, మార్చి 21: ప్రజల సహకారంతోనే స్వచ్ఛ హుజూరాబాద్ సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్, హుజూరాబాద్ మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేద్కర్ చౌరస్తాలో మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు చెత్తడబ్బాలు అందించారు. నూతన ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలు, వాకర్స్, విద్యార్థులతో కలిసి పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఐఈసీ ఎక్స్‌పర్ట్ ఫణి, ఇతర అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సోలార్ ప్లాంట్ల దరఖాస్తు దారులకు అవగాహన

ముకరంపుర, మార్చి 21: వ్యవసాయ క్షేత్రాల్లో 2 మెగా వాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న 179మంది దరఖాస్తు దారులకు శనివారం విద్యుత్ శాఖ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఈ మేక రమేశ్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, టీజీ రెడ్కో, లీడ్ బ్యాంక్ మేనేజర్లు పాల్గొని దరఖాస్తు దారుల సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సైదాపూర్, మార్చి 21: మండలంలోని బొత్తలపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మర్రి సదయ్య(47) సైదాపూర్ నుంచి గొల్లగూడెంకు ద్విచక్రవాహనంపై బయలుదేరగా, బొత్తలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన హుజూరాబాద్‌కు చెందిన ఓ స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా సదయ్య చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. కాగా, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాద వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉన్నది.

## సేవా కార్యక్రమాల్లో ముందంజలో వాసవీక్లబ్

వీణవంక, మార్చి 21: పేదల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడంలో వాసవీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని వాసవీక్లబ్ ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో వీణవంక జోన్ చైర్మన్ రామిడి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.30 వేల విలువ గల రెండు రిఫ్రిజిరేటర్లు అందజేశారు. 10 మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ చేశారు. సుమారు 300 మందికి డయాబెటీస్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పవిత్రం శ్రీనివాస్, గవర్నర్ ఇల్లందుల కిశోర్, రీజియన్ సెక్రటరీ నూక కృష్ణ, ఆర్‌సీ ఐత రమాదేవి, మండలాధ్యక్షుడు చిట్టిమల్ల హరిబాబు పాల్గొన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగించాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 21: రాజీవ్ యువ వికాసం పథకం గడువును పొడిగించాలని బీఆర్ఎస్ పార్టీ 30వ వార్డు అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. పథకం అమలుకు రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోగా, కొత్త రేషన్ కార్డులు జారీ కాకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని తెలిపారు. రేషన్ కార్డు లేకున్నా పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## ఉజ్వల భవిష్యత్‌ను సాకారం చేసుకోవాలి



మాట్లాడుతున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు

హుజూరాబాద్ రూరల్, మార్చి 21: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్‌ను సాకారం చేసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ పేర్కొన్నారు. శుక్రవారం సింగాపూర్ కిట్స్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన జరిగిన కిట్సోజన్-25 ముగింపు సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, సమాజంపై వినయ విధేయతలు కలిగి ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ నేర్చుకొని సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, హుజూరాబాద్ సీఐ తిరుమల్‌గౌడ్, ఉత్సవ అధ్యాపక సమన్వయకర్త డాక్టర్ సునీత, అధ్యాపకుడు రాజు, విద్యార్థి సమన్వయకర్తలు అభిరామ్, సింధుజ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి

కార్పొరేషన్, మార్చి 21: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాగు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అర్ష మల్లేశం, శ్రవణ్ నాయక్, రాంరెడ్డి, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ స్థానాల తగ్గింపునకు కేంద్రం కుట్ర

తెలంగాణచౌక్, మార్చి21: డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ స్థానాలు తగ్గించాలని కేంద్రంలోని బీజేపీ కుట్రలు చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి తమ మద్దతు ఉన్నా ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## స్వయం సమృద్ధి సాధనే 'వికసిత్ భారత్' లక్ష్యం

కమాన్‌చౌరస్తా, మార్చి 21: స్వయం సమృద్ధి సాధనే వికసిత భారత్ లక్ష్యమని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ పేర్కొన్నారు. ఎస్సారార్ కళాశాలలో కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల రెండు రోజుల వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికలు వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రధాన పాత్ర వహిస్తాయని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కడారు సురేందర్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా ఎంసీఆర్ హెచ్ఆర్డీ రిసోర్స్ పర్సన్ సంతోష్ మాట్లాడారు. కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల్లోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, ఇందులో 10 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు రెండు జిల్లాల నోడల్ సమన్వయకర్త ఎలిజబెత్ రాణి తెలిపారు.

## ఆశ కార్యకర్తల నిరసన

విద్యానగర్/చిగురుమామిడి, మార్చి 21 : అఖిల భారత కమిటీ పిలుపు మేరకు జిల్లాలో ఆశ కార్యకర్తలు సబ్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత మాట్లాడుతూ, ప్రోత్సాహక ఆధారిత జీతం స్థానంలో ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26వేలుగా నిర్ణయించి పెంచాలని, తదితర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రంగవేణి శారద, నాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి: డీఎంహెచ్‌వో

మానకొండూర్/ రూరల్, మార్చి 21: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీతోపాటు వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వేగురుపల్లిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీలో వేసవి కాలానికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ మహ్మద్ సల్మాన్, డాక్టర్ బియాబాని, సిబ్బంది ఉన్నారు.

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

హుజూరాబాద్ రూరల్, మార్చి21: కెనాల్‌లో ఈత కోసం వెళ్లి గల్లంతైన విద్యార్థి మృతదేహం మండలంలోని తుమ్మనపల్లి గ్రామ సమీపంలోని కాకతీయ కాలువలో శుక్రవారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వాసాల అరవింద్ (21) కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి అలుగునూర్‌లోని కాకతీయ కెనాల్‌లో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాకతీయ కెనాల్‌లో అరవింద్ గల్లంతయ్యాడు. తుమ్మనపల్లి సమీపంలోని కాలువ బ్రిడ్జి వద్దకు కొట్టుకువచ్చిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

వీణవంక, మార్చి 21: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో ఎస్.శోభారాణి సూచించారు. మండలంలోని చల్లూరు గ్రామంలో ఆల్ఫ్రెడ్ నోబెల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ సెరెమనీకి ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మంచిర్యాల ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ జాన్ థామస్, వీణవంక కేరళ ఇంగ్లిష్ మీడియం ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కులను పరిరక్షించాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 21 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాసేలా జీవోలు జారీ చేస్తున్నదని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని శాతవాహన యూనివర్సిటీ ఎదుట అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు రాస్తారోకోలు చేయవద్దని విద్యార్థుల హక్కులను కాలరాసేలా యూనివర్సిటీ వీసీ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉగాది కవితా పోటీలో ఎంపికైన 'ఆకాశమంత'

కమాన్‌చౌరస్తా, మార్చి 21 : శ్రీకాకుళం జిల్లాకు చెందిన వేమన కవితామయం, హైదరాబాద్‌కు చెందిన తపస్వీ మనోహరం సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన విశ్వావసు నామ ఉగాది కవితా పోటీలో కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, విమర్శకుడు వైరాగ్యం ప్రభాకర్ రచించిన ఆకాశమంత కవితా సంపుటి ఎంపికైనట్లు ఆ సంస్థల నిర్వాహకులు నిమ్మగడ్డ కార్తీక్ మహమ్మద్ రఫీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు మెమొంటో ప్రశంసా పత్రం అందించనున్నట్లు వెల్లడించారు.

## సేవ చేస్తాం.. అనుమతినివ్వండి

గంగాధర, మార్చి 21: మధురానగర్ తాపీమేస్త్రీ, సెంట్రింగ్ కార్మిక సంఘం సభ్యులు గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేతను శుక్రవారం పీహెచ్‌లో కలిశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ఏమైనా మరమ్మతు పనులు ఉంటే ఉచితంగా చేస్తామని సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు సంఘం తీర్మానం కాపీని వైద్యాధికారికి అందజేశారు. ఉచితాలు ఇవ్వండని అడిగే వ్యక్తులే కానీ, ఉచితంగా సేవ చేస్తామని చెప్పడం గొప్ప విషయమని వైద్యాధికారి శ్వేత సంఘం సభ్యులను అభినందించారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు బక్కశెట్టి గంగయ్య, ప్రధాన కార్యదర్శి గుంజి మల్లికార్జునరావు, సభ్యులు ఉన్నారు.

## వృద్ధురాలు అదృశ్యం


సావనపల్లి లక్ష్మి

కొత్తపల్లి, మార్చి 21 : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరం గ్రామానికి చెందిన వృద్ధురాలు సావనపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు బస్సులో కరీంనగర్‌కు ప్రయాణిస్తూ అదృశ్యం అయినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్లు 9494490268/ 8712670765కు సమాచారం అందించాలని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ పేర్కొన్నారు.

## 'నాగంపేట'లో చోరీ

జమ్మికుంట, మార్చి 21: నాగంపేటలో చోరీ జరిగినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగంపేట గ్రామానికి చెందిన ధార రవి శుక్రవారం ఉదయం అదే గ్రామానికి చెందిన రైతు పొలంలోకి కూలి పనికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో భద్రపరిచిన బంగారం, రూ.20 వేల నగదు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

## బల్దియాకు ఏఈల కేటాయింపు

కార్పొరేషన్, మార్చి 21 : కరీంనగర్ నగరపాలక సంస్థకు మున్సిపల్ శాఖ ఇద్దరు ఏఈలను కేటాయించింది. పోలాడి భీమ్ వర్ధన్ రెడ్డి, ఎండీ సల్మాన్ ఖాన్‌ను నగరపాలక సంస్థకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## సమావేశానికి తరలిరావాలి

వీణవంక, మార్చి 21: కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## వంట సామగ్రి అందజేత

చొప్పదండి, మార్చి 21: గుమ్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట సామగ్రి పాడైపోయిందని పాఠశాల యాజమాన్య కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన కలెక్టర్ పమేలా సత్పతి, అవసరమైన సామగ్రి అందించాలని తహసీల్దార్ నవీన్ కుమార్‌కు సూచించగా, ఆయన సొంతంగా రూ.20వేల విలువైన మధ్యాహ్న భోజన వంట సామగ్రిని పాఠశాలకు అందజేశారు.